**International Journal of Academic Research**
**ISSN: 2348-7666; Vol.3, Issue-1(1), January, 2016**
**Impact Factor: 3.075; Email: drtvramana@yahoo.co.in**

# తెలుగు సినిమా పాటల్లో నదీతోయమాలికలు

డా॥ నంబాళ్ల భానుశ్రీ
ఆంధ్రోపన్యాసకులు
మీనకేతన్ డిగ్రీ కాలేజ్
గురండి
ఒడిసా - 761210
mail : bhanusree.namballa@gmail.com

**"ఏదేశ సంస్కృతి అయినా ఏనాడు కాదొక స్థిర బిందువు**
**నైక నదీనదాలు కలిసిన అంతస్సింధువు" – తిలక్**

పరిఢవిల్లిన ప్రపంచ నాగరికతకు మూలం నదీలోయ నాగరికతే. మానవ జీవితగమనం నదులతో విడదీయరాని బంధం ఏర్పర్చింది. నదీ ప్రస్తావనలేని మానవ జీవన చరిత్ర శూన్యం అనడం అతిశయోక్తి కాదు. ఓ సంస్కృతి కేవలం ఒకే ప్రాంతానికి పరిమితమై పోకుండా తాను పారాడే నేలనంతటికి దాన్ని విస్తరింపచేసే ఘనత నదులదే. అందులో బాగమే పుష్కర సన్నివేశం. ఎన్నో వైవిద్యభరితమైన బాధ్యతలను తనపై వేసుకున్న ప్రసార సాధనాలన్నిటికంటే గొప్పది సినిమా మాధ్యమం. వివిధ సందర్భాలకు సంబంధించిన ఘట్టాల గొప్పతనం సినిమా పాటల్లో ధ్వనించినట్లే నదుల ప్రస్తావన వాటి కీర్తి ప్రతిష్ఠలు గూర్చికూడా "నేనుసైతం" అంటూ స్పందించిందీ మాధ్యమం.

తెలుగు సినిమా పాటల రచయితలు దేశ ఔన్నత్యాన్ని కీర్తించేటప్పుడు అందులో అంతర్భాగంగా నదులను ప్రస్తావిస్తుంటారు. కొందరు నదులను స్త్రీమూర్తులుగా భావించి నేటి సంస్కృతిలో వాటికున్న సంబంధం గూర్చి వివరిస్తుంటారు. మరొకొందరు తెలుగు నేలతోపాటు భారత దేశంలో ప్రవహించే నదుల ప్రవాహాన్ని వివిధ హావ భావాలతో ముడిపెట్టి తమ రచనలు కొనసాగిస్తుంటారు. వీటికి ఉదాహరణలుగా కొన్ని సినిమా పంక్తులు చెప్పుకోవచ్చు.

**"కొండగలి తిరిగింది గుండె వూసులాడింది**
**గోదావరి వరదలాగా కోరిక చెలరేగింది (ఆరుద్ర)**

**"వయ్యారి గోదారమ్మ ఒళ్ళంత ఎందుకమ్మ కలవరం (వేటూరి)**
**"నిన్నటి దాకా శిలనైనా**
**నీ పదము సోకి**
**నే గౌతమినైనా**
**నీ మమతావేశపు వెల్లువలో**
**గోదారి గంగనై పొంగుతు ఉన్నా (వేటూరి)**

**"నేనీదరిని నువ్వాదరిని**
**కృష్ణమ్మ కలిపింది ఇద్దరిని (ఆత్రేయ)**

**"గోదారి గట్టుంది గట్టుమీన చెట్టుంది' (దాశరధి)**

**"కృష్ణమ్మ పెన్నమ్మ పెనవేసుకున్నట్టు**
**గోదారి కావేరి ముద్దాడుకున్నట్టు**
**గంగమ్మ యమునమ్మ ఒడి చేరుకున్నట్టు'** [illegible]

ఇలా ఎన్నైనా చెప్పుకోవచ్చు. అయితే చరిత్ర సంస్కృతి మొ॥ వాటితో సంబంధమున్న నదీ కీర్తన పాటలు తెలుగు సినిమాల్లో కొన్ని పాక్షికంగానూ కొన్ని పూర్తిగానూ చోటుచేసుకున్నాయి.

1949లో విడుదలైన "మనదేశం" సినిమాకు సముద్రాల సీనియర్ రాసిన "జయజయ పరమపాద, జయజయ భారత జననీ " అనే పాట భారతదేశపు భౌగోళికాంశాలను కీర్తిస్తుంది. అందులో భాగంగా

**"గంగా సింధూ మహానదీ గౌతమి కృష్ణ కావేరీ**
**జీవ సార పరిపోషిత కోమల సస్య విశాలాశామలా"**

అంటూ నదులను కీర్తించారు. భారతీయుల దృష్టిలో దేశంలోని ప్రతీ అంగుళం చోటుకూడా పవిత్రమైందే. కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు గల యావద్భారత దేశంలోని నదులు వాటి ఒడ్డున వెలసిన ప్రాంతాలకు క్షేత్రమహత్యాలు కల్పించడం వలన వాటిని పురాణ గాథలుగా ప్రజలు చదువుకున్నారు. ఒక్క ఆంధ్రదేశంలోనే కనీసం వంద క్షేత్రాలకైనా మహాత్యాలు వివరించే కథలు వ్యాప్తి చెందాయి. గోదావరి పుట్టుకకోసం గౌతముని గోవథ కథ దానికొక మచ్చుతునక. గంగానది జలాన్ని నెత్తిపైన చల్లుకున్నంత మాత్రాన పరమ పవిత్రులమౌతామని మనవారు భావిస్తున్నారు. ఇప్పటికీ కాశీకి వెళ్ళిన వాళ్ళు చిన్న కలశాలలో గంగా జలాన్ని తెచ్చి ఆ కలశానికి సీలు వేయించుకుని పూజా మందిరంలో పూజించే ఆచారం దక్షిణ భారతదేశమంతటా కనిపిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఒక మహానదిలోని నీటిని నిష్ఠతో పూజించినంతగా మరో దేశంవాళ్ళు చేస్తున్నట్లు కనిపించడంలేదు. వేలాది సంవత్సరాలుగా నదీ నదాలను పవిత్రంగా పూజించడం భారతీయ సంస్కృతిలో నిత్యానుభవమైన సత్యం అందుకే మనవేదాలలో

**'గంగేచ యమునైచైవ కృష్ణా గోదావరి**
**నర్మదా సింధూ కావేరి జలేస్మిన్ సన్నిధంకురు"**

అని చెప్పబడింది. అంతేకాకుండా నీరు ద్రవరూపంలో ఉన్న ప్రాణం అంటారు. సమస్త జీవకోటికి దీన్ని అందించే నదులు పూజ్యమైనవే. పై పాటలో జీవసరంతో పెంచబడ్డ పచ్చని పంటలు గల దేశంగా కీర్తింపబడింది. ఇలా నదుల పాక్షిక ప్రస్తావన గల సినిమా పాటలు ఎన్నో ఉన్నాయి.

**"గంగా సింధూ కావేరీ కృష్ణా పెన్నా గోదావరి**
**తుంగభద్ర నదీ నదులను కలిసి ఒకటిగా పారింది.**

**- బంగారు భూమి (1951) మల్లాది**

**కల్లోల గౌతమి వెల్లవల కృష్ణమ్మ**
**తుంగభద్రాతల్లి పొంగి పొరలినచాలు**
**ధాన్యరాశులు పండుదేశానికి**
**కూడు గుడ్డకు కొదువలేదోయ్**

**- పల్లెటూరు (1952) - వేములపల్లి శ్రీకృష్ణ**

గౌతమీ నదిని కల్లోల గౌతమిగా కృష్ణమ్మను వెల్లువల కృష్ణమ్మగా వర్ణించబడింది. తుంగభద్రా తల్లి పొంగిపోర్లునట్లు చెప్పబడింది.

ఆంధ్రోద్యమానికి పురస్కరించుకొని 1945లో వేములపల్లి శ్రీకృష్ణ రాసిన గేయాన్ని సినిమాల్లో యిమిడ్చారు. పల్లవి "చేయెత్తి జైకొట్టు తెలుగోడా". అందులో పై నదీ ప్రస్తావన ఉంది. కల్లోల, వెల్లవల, పొంగి పొరలు అనే మాటలు ఆంధ్రదేశ నలుమూలలకు సరిపడే జలసంపద అందివ్వగల జీవనదులుగా కవి మన కళ్ళముందు నిలిపాడు. శ్రావణ భాద్రపదాలలో గోదావరి ప్రాంతంలో నివసించే వారికి కల్లోల గౌతమి స్వరూపం శాశ్వతంగా హృదయఫలకంపై నిలిచిపోతుంది. అలాగే కృష్ణ తుంగభద్ర నదులు పొంగిన చోట్లంతా ధాన్యరావులకు లోటుండదని ఆ ప్రాంతీయులకు అభవైద్యకమైన విషయం.

"జై ఆంధ్ర జననీ
...........
కృష్ణ గోదావరి
పెన్నా కావేరి
తుంగభద్రోతంగ తరంగిణీ"
– అగ్గిరాముడు (1954) ఆత్రేయ

భారతవీరా ఓ భారతవీరా
............
గంగ యమున గోదావరి కృష్ణా నదులు మరలించాలి
మహానదులు మరలించాలి
– భలేరాముడు (1956) సదాశివబ్రహ్మం

ఈదేశం ఆంధ్రుల దేశంగా
....
"గోదావరి జలాలే పారాడా
కృష్ణమ్మ పొలాలా తారాడా
అహ పచ్చని చేలే ఊగాడా
మన జాతికి కొదవే లేదన్నా"
– సవతి కొడుకు (1963) ఆలూరి బైరాగి

"మహాత్ములే కలలు గన్న మరో ప్రపంచం
............
గంగా కావేరి నదులు కలుపుతాం
కలిసి సరిహద్దులు చెరిపి చెలిమి నిలుపుదాం"
– మరో ప్రపంచం (1970) శ్రీశ్రీ

"స్వాగతం దొర సుస్వాగతం
....
గోదావరి పాదాలకు నీళ్ళివ్వగా
పినాకినీ పిలిచినీకు పీట వేయగా
కృష్ణవేణి మెచ్చి నీకు కడుపు నింపగా
కన్నతల్లి కడుపు తీపి తాంబూల మీయగా"
– దేశోద్ధారకుడు 1973 – మొదుకూరి జాన్సన్

పాడనా తెలుగుపాట

.....

గోదావరి తరగల గలగలలు

– అమెరికా అమ్మాయి (1976) దేవులపల్లి కృష్ణశాస్త్రి

**మా తెలుగుతల్లికి మల్లెపూదండ**

**..................**

**గలగలా గోదారి కదలిపోతుంటేను**

**బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను**

**బంగారు పంటలే పండుతాయి**

**మురిపాల ముత్యాలు దొరలుతాయి"**

**– బుల్లెట్ 1985 శంకరంబాడ సుందరాచారి**

మొదలగు ఎన్నో పాటలు ప్రస్తావించవచ్చు. పాటంతా నదుల గూర్చే రాయబడ్డవి కొన్ని పరిశీలిద్దాం.

1969 నాటి విచిత్ర కుటుంబం సినిమాకు డా॥ సినారె రాసిన పాట "ఆడవే జలకమ్ములాడవే" ఈ పాట ఆంధ్రరాష్ట్ర చరిత్ర సంస్కృతుల్ని నదీ మాతృకలద్వారా ప్రశంసిస్తుంది. సినిమాలోని సన్నివేశం ప్రకారం రష్యానుంచి వచ్చిన ఓ అమ్మాయి తెలుగింటి కోడలయింది. పెళ్ళయిన తరువాత దంపతులు విహారార్థం వెళ్లడం లాంటి సాంప్రదాయం ఉంది ఆంధ్రజాతి సంస్కృతిపట్ల అభిమానమున్న సినారె ఆ దంపతుల్ని ఆంధ్రచరిత్ర సంస్కృతి చిహ్నాలైన స్థలాల్లో విహరింప జేసారు. పాటలో మొదటి చరణాలైన

**"ఆదికవి నన్నయ్య అవతరించిన నేల**

**తెలుగు భారతి అందియలు పల్కెనీనేల**

**ఆంధ్ర సంస్కృతి తీయని క్షీరధారలై**

**జీవ కళలొల్కు గోదావరి తరంగాలలో"**

ఇందులో గోదావరి నదిని గూర్చి తొలి తెలుగు కావ్యమైన ఆంధ్రమహాభారతం ఉదయించింది. రాజమహేంద్రవరమని తెలిపారు. ఈ చరణంలో క్షీరధార అనే పదప్రయోగం విశేషం. అప్పటికే ఉన్న ఆంధ్ర సంస్కృతికి గోదావరి జలధారలు జీవకళలొలికించాయి. నీరం కంటే క్షీరం జీవవర్ధిని అని ఈ పదప్రయోగం ఆంధ్రమహాభారతం వెలుగు జాతి శైశవదశలో ఉన్నప్పుడు రాయబడ్డ కావ్యం. ఆ పాలు వంటపట్టడం వలనే అది క్రమంగా వర్ధిల్లింది.

రెండవ చరణాలు

**'నాగార్జునుని బోధనలు ఫలించిన చోట**

**బుద్ధం శరణం గచ్ఛామి ధర్మం శరణం గచ్ఛామి**

**సంఘం శరణం గచ్ఛామి**

**కృష్ణవేణి తరంగిణి జాలిగుండెయై**

**సాగరమ్మై రూపు సంతరించుకొనువేళ"**

ఆంధ్రదేశాన్ని పరిపాలించిన ఇక్ష్వాకుల కాలం నాటి కృష్ణవేణి నాగార్జున సాగరంగా వెలసిన తరువాత దశలో నాగార్జునాచార్యుడు నాగార్జున కొండగా పేరుగాంచిన నందికొండ కేంద్రంగా బౌద్ధమత ప్రచారం చేసాడు. అందుకై ఒక విశ్వవద్యాలయాన్నే స్థాపించారు. బౌద్ధమత వ్యాప్తికి నాగార్జునుడు ఎంతో కృషి చేశాడు. అంతటి చారిత్రిక ప్రాధాన్యతగల స్మరణీయ వైభవానికి నిత్య సాక్షిగా కృష్ణవేణి వెలసింది.

మూడవ చరణం

**"కత్తులను గంటములు కదనుత్రొక్కినవిచట**
**అంగళ్ళ రతనాలు అమ్మినారట ఇచట**
**నాటి రాయల పేరు నేటికిని తలపోయ**
**తుంగభద్రనది తోయమాలికలందు"**

అంటూ శ్రీకృష్ణదేవరాయలనాటి చరిత్ర సంస్కృతి తుంగభద్ర పరంగా పురోవృద్ధిని సాధించింది. హంపీ క్షేత్రం కృష్ణదేవరాయల సాహితీ సమరాంగణ సార్వభౌమత్వం కంటేముందు సాక్షాత్కరిస్తుంది. రాయల నాటి కదన శౌర్య కవితామాధుర్యాలకు, ఐశ్వర్యాలకు ఎంతో ఖ్యాతి పొందింది.

1974 నాటి "కృష్ణవేణి" సినామాకు "కృష్ణవేణి తెలుగింటి విరిబోణి" అనే పల్లవితో డా॥ సినారె రాసిన పాట కృష్ణవేణి నదీ మాతృకను ప్రశంసిస్తుంది. లాటానుప్రాస అలంకారంతో ప్రాంభమైన పాటలో నాయకుడు తన నాయకి అయిన కృష్ణవేణిపైగల అనురాగాన్ని ఉద్దేశించుకుంటాడు. నాయకుని అనురక్తికాక నాయక పరంగా చూస్తే స్త్రీ మూర్తిరూపంలో కవి కృష్ణవేణి నదిని ప్రశంసించారు.

**"శ్రీగిరిలోయల సాగే జాడల**
**విద్యుల్లతలు కోటి వికసింపజేసావు"**

శ్రీ గిరి అంటే శ్రీ పర్వతం. నాగార్జున కొండ దీని పూర్వనామం ఆ కొండ లోయల్లో కృష్ణవేణి ప్రవహిస్తున్నప్పుడు కోటి విద్యుల్లతలు వికసింపజేస్తుంది. అంటే నాగార్జున సాగర్‌లో 960 మెగావట్‌ల విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రాజక్టు ఉంది. కృష్ణానది నాగార్జున సాగరంగా మలచడమనే విషయాన్ని గూర్చి నదీ మాతృకపరంగా ప్రశంసించడం జరిగింది.

**"నాగార్జున గిరి కౌగిట ఆగి**
**బీళ్లను బంగారు చేలుగా మార్చావు"**

నాగార్జున సాగరం పంట కాల్వల ద్వారా నీరు సరఫరా చేపట్టడం వలన 1955 తరువాత బీల్పుగా ఉన్న పొలాలు బంగారు పంటలు పండే విధంగా మార్చబడ్డాయి.

**"అమరావతి గుడి అడుగుల నడయాడి**
**రాళ్ళను అందాల రమణులుగా తీర్చావు"**

అంటూ గుంటూరు జిల్లాలో ప్రసిద్ధిగాంచిన అమరావతి చారిత్రిక బౌద్ధ క్షేత్రం గూర్చి ప్రశంసించారు. అమరావతి మందిరాల్లోని 'అద్భుత శిల్పాలు లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియంలో తలెత్తుకుని నిలుచున్నాయి. ఆ శిల్పాలు కృష్ణవేణీ నదీ ప్రేరణతో వెలసిన శిల్పాలుగా అమరావతి కళగా గుర్తింపు పొందింది. జాతి సంస్కృతి నదీలోయల్లోనే అభివృద్ధి చెందిన విషయం ఇక్కడ చెప్పకనే చెబుతుంది.

**"అభిసారికవై హంసలదీవిలో**
**సాగర హృదయాన సంగమించావు"**

కృష్ణానది సాగరసంగమం తన అభిష్టం మేరకే కనుక అభిసారికగా వర్ణించబడింది. కృష్ణానది భౌతిక రూపం పరిశీలిస్తే స్త్రీవేణి (జడ) ఆకారంగా అందంగా ఉంటుంది. నీరు కృష్ణ వర్ణంగా ఉండటం వలన ఆ నదిగకాపేరు సార్ధకమమైంది. భక్తి బావంతో కృష్ణమ్మను దర్శించే వారికి ఆ తల్లి జీవన్ముక్తి ప్రదాయినిగా గోచరిస్తుంది. పురాణమునులైన గర్గ, కశ్యపాదులు ఈ దృష్టితోనే ఆ నదీమతల్లిని సేవించినట్లు కథలు ఉన్నాయి.

అలనాటి హరిహర బుక్కరాలయల కాలంలోని విద్యారణ్యులందించిన వైదిక లౌకిక సంస్కృతుల్ని స్మరిస్తూ కృష్ణరాయల కాలంలో వెల్లివిరిసిన సాహిత్య సంగీత శిల్ప చిత్ర కళాదుల్ని జ్ఞాపకం చేసుకుంటూ నూతనోత్తేజంతో సారభూతమైన మృదంగ తాళ వాద్యనర్తన గతులలో తెలుగు నేలపైకి కృష్ణవేణి పాదం

మోపింది. అలా ప్రవహిస్తున్న కృష్ణవేణి నది తీరప్రాంతాల్లో అలంపూరు, పాపనాశిని, చేబ్రోలు, శ్రీశైలం, నాగార్జునకొండ, మొదలగు పేర్లతో సంస్కృతి చిహ్నాలై నిలిచాయి. నాగార్జున సాగర్ ద్వారా జంట నగరాల నీటికొరతను తీర్చిన కృష్ణవేణిని, పలనాటి వెలలేని మాగాణిగా మార్చిన కృష్ణవేణిని కవులనూ, కళాకారులనూ పారవశ్యంతో ముంచిన కృష్ణవేణిని శాతవాహన వైభవ తరంగ గానంతో కీర్తించిన కృష్ణవేణిని అడుగడుగునా గుడి చూస్తూ సాగర యానం చేస్తున్న కృష్ణవేణిని తరతరాల తెలుగు సంస్కృతికి స్వచ్ఛ దర్పణంగా చెప్పవచ్చు.

1983 నాటి "ఆంధ్రకేశరి" చిత్రానికి ఆరుద్ర రాసిన పాట **"వేదంలా ఘోషించే గోదావరి"**, నేటి రాజమండ్రి నగరానికి గతంలో వేంగీనగరం, జననాధనగరి, రాజమహేంద్రి అనే ప్రాచీన నామాలుండేవి. ఆంధ్ర సంస్కృతి సాహిత్యాలకు మూలబీజం పడిన స్థలం రాజమహేంద్రి. దీన్ని అమరధామ మనడం గోదావరి హోరును వేదఘోషగా వర్ణించడం విశేషం.

చాళుక్యులు, కాకతీయులు, రెడ్డిరాజులు, గతపతులు నరసబులు మొదలగు రాజులు పరిపాలించినప్పటికీ వారి అధీనంలో ఈ నగరమెంతో ఒప్పారింది. నన్నయరాసిన భారతంలోని మొదటి శ్లోకం **"శ్రీవాణీ గిరిజాశ్చరాయ"** ఈ పాటలో పొందపర్చడం వలన పాటకు వేదఘోషకు, గోదావరి హోరుకు విశిష్ఠత ఏర్పడింది. గోదావరి నది తెలుగు జాతి భాషా సంస్కృతికి మూలాంకురమైన మహాభారతాన్ని నన్నయను కీర్తిస్తూ చిరస్థాయిగా తెలుగునాట జీవనదిగా ప్రవహిస్తుంది. వీరే కాకుండా మరెందరో కవులు కీర్తిప్రతిష్ఠలు పెంపొందడానికి రాజమహేంద్రి చిహ్నామై నిలిచింది. గోదావరి నది నీరు త్రాగేవారికి సాహిత్యం కావేరీ నది నీరు త్రాగేవారికి సంగీతం అబ్బుతుందని నానుడి. ఆధునిక సాహిత్య యుగంలో కూడా పేరు ప్రఖ్యాతులు గాంచిన కవి, సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం. ఇతని జన్మస్థలం కూడా రాజమహేంద్రి గోదావరికి కోటి లింగాల రేవు ప్రముఖమైంది. అక్కడ కోటి శివలింగాలు ఉండేవని అవి గోదావరి వరదల్లో కొట్టుకుపోయాయని ఓ నమ్మకం. అందుకే కవి **"కొట్టుకొని పోయే కొన్ని కోటి లింగాలు వీరేశలింగమెగడు మిగిలెను చాలు"** అని చెప్పాడు. సారంగధర చిత్రాంగి కథలు ప్రచారంలో ఉన్నాయి. ఇప్పటకీ చిత్రాంగి మేడ రాజమండ్రిలో మనకు కనిపిస్తుంది. ఇవన్నీ కట్టు కథలంటారు కవి. ఏది ఏమైనా గోదావరి వలన రాజమండ్రి, రాజమండ్రి వలన గత చరిత్ర సంస్కృతి మనకు గోచరిస్తాయి.

తెలుగు సినామా పాటల సాహిత్యం తెలుగు సాహిత్యానికి ఒక శాఖ అనలేనప్పటికీ సామితీ గుభాలింపులకు మాత్రం లోటులేదు. అయినా సినిమా పాట మాటల్లో చెప్పలేని భావం మనసుకందిస్తుంది. అది నదీ మాతృకల సంస్కృతులను తోయమాలికల్లో జాలువారుస్తాయి.

**సంప్రదించిన గ్రంధాలు :**


1. అమృతం కురిసిన రాత్రి – తిలక్
2. ఆత్రేయ సాహితి – ఆత్రేయ సినిమా పాటలు
3. ఆరుద్ర సినీ గీతాలు
4. గోరింట (వెండి తెర పాటలు) – దేవులపల్లి కృష్ణశాస్త్రి
5. పాటలో ఏముంది, నా మాటలోఏముంది – డా॥ సినారె
6. వేటూరి సుందర రామమూర్తి నవరస గీతాలు
7. తెలుగు సినిమా పాట – పైడిపాల
8. సినిమా పాటల్లో సాహిత్యపు విలువలు – డా॥ చిట్టిబోయిన కోటేశ్వరరావు
9. తెలుగు సినిమా దేశభక్తి గీతం – డా॥ నంబాళ్ళ భానుశ్రీ
10. ఒక ఊరి కథ – ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరరావు.

డా॥ నంబాళ్ల భానుశ్రీ
ఆంధ్రోపన్యాసకులు
మీనకేతన్ డిగ్రీ కాలేజ్
గురండి
ఒడిసా - 761210

